# [illegible]

బి. సత్యవతి

రంగనాథంగారు చెప్పినట్లుగానే - తనమాట నిలబెట్టుకున్నారు.

"బి.ఎ. చదువుకుని, ఈ నగల కొట్టులో గుమాస్తాగా - ఎదుగు బొదుగులేని జీతంతో ఎంతకాలం వుంటావ్? నీకు వచ్చే వెయ్యిరూపాయల జీతంలో - పల్లెటూళ్లో వున్న మీ తల్లిదండ్రులకు కనీసం నాలుగు వందలైనా పంపాలంటున్నావ్.. ఇలా అయితే కష్టం.. మద్రాసులో నాకు తెలిసిన మిత్రుడు ఒక పెద్ద ప్రైవేటు కంపెనీలో మేనేజర్‌గా పనిచేస్తున్నాడు.. అతనికి నేను ఒక ఉత్తరం రాస్తాను. నీ వివరాలన్నీ రాసి ఒక అప్లికేషన్ తయారుచేసి ఇస్తే నేనతనికి పంపిస్తాను. నీకు కబురొస్తే, తప్పకుండా మద్రాసు వెళ్లు. నీకు మంచి భవిష్యత్తు వుంటుంది" అన్నారు - ఆరోజు రంగనాథంగారు.

నేను అప్పుడు ఆయన చేతికి నా అప్లికేషన్ ఇచ్చినా నాకేమీ పెద్ద నమ్మకం లేదు. ఎంతోమంది - నా పరిస్థితికి సానుభూతి చూపించి, ఎన్నో చల్లని మాటలు చెప్పారే కాని, ఆచరణ రీత్యా ఎవరూ నాకు సహాయపడలేదు. ఐతే రంగనాథంగారు ఏ వాగ్దానమూ చెయ్యలేదు. ఎలాంటి ఆశలూ కల్పించలేదు. ముక్తసరిగా నాలుగు మాటలు చెప్పి, నా దగ్గర్నుంచి అప్లికేషన్ తీసుకున్నారు. ఆతర్వాత ఆసంగతే నేను మర్చిపోయాను!

'నిండుకుండ తొణకదు' అంటారు. అన్నట్లుగానే ఆయన ఏంచేశారో గాని - రెండు నెలల తర్వాత నాకు మద్రాసు నుంచి ఓ పిలుపు వచ్చింది - ఫలానా రోజున సాయంత్రం 4 గంటలకు ఇంటర్వ్యూకు హాజరు కావలసిందిగా కోరుతూ.

ఈ సంగతి ఆయనకు తెలియజేద్దామని, గవర్నర్ పేటలో వున్న వాళ్లింటికి వెళ్లాను. రంగనాథంగారు రాజమండ్రి వెళ్లారట. పది రోజుల తర్వాతగానీ రారు!

ఇంటర్వ్యూ ఇంకా మూడు రోజులే వ్యవధి వుంది. నేను ఎన్ని రోజులు సెలవు పెడితే, అన్ని రోజులు జీతంలో నష్టపోవలసి వస్తుంది. అందుకని నామిత్రులు ఓ సలహా చెప్పారు. ఉదయం విజయవాడలో బయలుదేరే పినాకిని ఎక్స్‌ప్రెస్ ఎక్కితే, మధ్యాహ్నం ఒంటి గంటకు మద్రాసు చేరుకుంటుంది. నేను ఇంటర్వ్యూకు హాజరు కావలసిన ఆఫీసు - రైల్వే స్టేషన్‌కు దగ్గర్లోనే వుంది కాబట్టి - స్టేషన్‌లో భోజనం చేసి, సాయంత్రం 4 గంటలకు ఇంటర్వ్యూకు హాజరు కావచ్చు. ఆరోజు రాత్రే మద్రాసులో బయల్దేరే ట్రెయిన్ ఎక్కితే, మర్నాడు ఉదయం విజయవాడ చేరుకోవచ్చు.

అంటే ఒకే ఒక్కరోజు సెలవు పెడితే చాలు.. మద్రాసులో ఎక్కడా బస చేయకుండానే, ఇంటర్వ్యూకు హాజరై, మర్నాడు ఉదయం విజయవాడకు వచ్చేయవచ్చు.

అంతా బాగానే వుంది. మరి రైలు ఛార్జీలకు డబ్బు లేదు.. ఎలా? అని సతమతమైపోతూవుంటే, మా షాపుల్లో పనిచేసేవాళ్లకు ఇలాంటి అత్యవసర పరిస్థితుల్లో - అత్యధిక వడ్డీకి డబ్బిచ్చే ఓ పెద్ద మనిషి దగ్గరకు నన్ను తీసుకువెళ్ళారు మిత్రులు. నూటికి నెలకు పదిరూపాయలు వడ్డీ! రెండువందల యాభై రూపాయలకు - ఇరవై ఐదు రూపాయల వడ్డీ ముందే తగ్గించుకుని, తక్కిన డబ్బు యిచ్చాడు!

ఎలాగైనా ఈ ఇంటర్వ్యూకు వెళ్తే, నా భవిష్యత్తు బాగుపడవచ్చుని, నాకూ నా మిత్రులకూ ఓ దృఢమైన నమ్మకం! అందుకనే ప్రొప్రయిటర్‌కు ఈ ఇంటర్వ్యూ సంగతి చెప్పకుండా అతి కష్టం మీద ఒకరోజు సెలవు సంపాయించాను. ఆరోజు పినాకిని ఎక్స్‌ప్రెస్ - సమయానికే బయలు దేరింది. 'సూపర్ ఫాస్ట్' ట్రెయిన్‌లో మొట్టమొదటిసారిగా ప్రయాణం చేస్తున్నందుకు నాకెంతో ఉత్సాహం కలిగింది.

ఏ కంపార్ట్‌మెంట్‌లోనైనా కూర్చోవచ్చునంటే, నేనొక బోగీలో కూర్చున్నాను. తెనాలిలో ఎవరో వచ్చి, 'ఇది మాకు రిజర్వు అయిన సీటు.. ఈ వూరు కోటాలో ఈ సీటు మాకు కేటాయించారు' అని నన్ను లేవమన్నారు. అంతా నావంక సానుభూతితో చూస్తూ వుంటే లేచి, మరో ఖాళీ సీటులో కూర్చున్నాను. ఒంగోలు స్టేషన్‌లో మరొకరు వచ్చి, అది తన సీటు అన్నారు. నాకేమీ అర్థం కాలేదు. మరెక్కడా కూర్చోడానికి సీటు లేకపోయేసరికి నిలబడే ప్రయాణం చేయవలసి వచ్చింది!

10 గంటల నలభై నిమిషాలకు పినాకినీ ఎక్స్‌ప్రెస్ 'తలమంచి' అనే స్టేషన్‌లో కొంతసేపు ఆగింది. అక్కణ్ణుంచి కదిలాక కొడవలూరు, పడుగుపాడు.. వెంకటాచలం.. ఇలా 'స్టాపింగ్‌లేని' స్టేషన్‌లలోనూ ఆగి, కొంతసేపు విశ్రాంతి తీసుకుని బయల్దేరుతూ వుంది ఆ సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్!

నాలా నిలబడివున్న వాళ్లను తోసుకుంటూ - జామకాయలు అమ్మేవాళ్లు, జీడిపప్పు పొట్లాలు అమ్మేవాళ్లు, బిచ్చగాళ్లు, కంపార్ట్‌మెంట్స్‌లో దుమ్ము వూడుస్తూ డబ్బులు అడిగే కుర్రవాళ్లు.. ఇలా వస్తూ పోతూనే వున్నారు.

అనధికారంగా తినుబండారాలు అమ్మేవాళ్లను, బిచ్చగాళ్లను రైలు పెట్టెల్లోంచి పంపించి వేయాలని - కోచ్ అటెండెంట్, టిటియిలకు సూచనలిస్తున్న బోర్డు - ప్రతి పెట్టెలోనూ ప్రయాణీకులను వెక్కిరిస్తూనే వుంది. అసలు కోచ్ అటెండెంట్‌లు, టిటియిలు కనిపిస్తే కదా.. వాళ్లను పంపించి వేసే సంగతి ఆలోచించడం!

నాకు ఈ బోర్డులు, ప్రకటనల మీద అసలు నమ్మకం లేదు!

ప్రభుత్వం 'సత్యమేవ జయతే' అంటుంది. ఆ ప్రభుత్వ ఆఫీసుల్లోనే లంచగొండితనం వీరవిహారం చేస్తూ వుంటుంది. తాగితే ఇల్లు, ఒళ్లు గుల్లయిపోతుందని మద్యం సీసాలమీద రాసి వుంటుంది. ఆ మద్యం తయారు చేయడానికి, అమ్మడానికి ప్రభుత్వమే లైసెన్సులు ఇస్తుంది! సిగరెట్లు అంతే! తిరుమలపైన ఎక్కడబడితే అక్కడ బోర్డులు.. 'దళారీలను నమ్మకండి.. బస చేయడానికి, తదితర వసతులకు దేవాలయ నిర్వాహణ అధికారులనే సంప్రదించండి' అని రాసి వుంటుంది. ఆ బోర్డుల పక్కనే దళారులు స్వేచ్ఛగా తమ 'వ్యాపారాన్ని' కొనసాగిస్తూ వుంటారు!

థియేటర్ ముందు 'హౌస్ ఫుల్' బోర్డు వుంటుంది. కౌంటరు పక్కనే ఒకరు - విడిగా తీసి వుంచిన టిక్కెట్లను అధిక ధరకు అమ్మేస్తుంటారు! ఇటువంటివన్నీ చూసి, నవ్వుకోవడం అలవాటైపోయింది కాబట్టి, ఈ రైల్లో జరుగుతున్న 'వ్యాపారాలు' నాకు పెద్దగా ఆశ్చర్యాన్ని కలిగించలేదు.

నెల్లూరు స్టేషన్ నుంచి రైలు బయల్దేరింది. సరిగ్గా అప్పుడే అనౌన్సర్ కోకిల కంఠం వినిపిస్తోంది - 'పినాకిని ఎక్స్‌ప్రెస్ బయలుదేరుటకు సిద్ధంగా వుంది' అని! అందరూ గొల్లున నవ్వుకున్నారు. రైలు అప్పటికే గంటన్నర ఆలస్యంగా నడుస్తోంది కాబట్టి ఆ కష్టాన్ని మరిపించడానికి రైల్వేవారు ఇలా తమ శక్తి కొద్దీ 'వినోదాన్ని' సరఫరా చేస్తున్నారని ఒకాయన వ్యంగ్యంగా వ్యాఖ్యానం చేశారు.

'గంటన్నర లేటు' అనే సరికి నాగుండె గుభేలుమంది. నేను సాయంత్రం నాలుగు గంటలకు ఆ ఆఫీసుకి చేరుకోలేకపోతే.. పడ్డ కష్టం అంతా వృధా అయిపోతుంది.

"జపాన్‌లో రైలు ఆలస్యంగా చేరుకుంటే, ప్రయాణీకులకు నష్టపరిహారం ఇస్తారండీ.. మన రైల్వేవాళ్లు. కనీసం ఆలస్యానికి విచారాన్ని కూడా వ్యక్తం చేయరు. ఇలాంటి అన్యాయాలను, వినియోగదారులపై జరిగే దోపిడీని ఎదిరించడానికి మనకు హక్కులు వున్నాయి. కానీ మనం వాటి గురించి ఆలోచించం.. ప్రతిఘటించం.. అందుకే ఇటువంటివన్నీ కొనసాగిపోతున్నాయి.." ఎవరో చాలా ఆవేశంగా మాట్లాడుతున్నారు.

ఆ మాటలేవీ నాకు తలకెక్కడం లేదు. ఈ సూపర్ ఫాస్ట్ ట్రయిన్‌ను నమ్మి మోసపోయానన్న సంగతి రుజువైపోయింది.

మూడు గంటలకు మద్రాసు చేరుకుంది రైలు. నాకు ఆకలి చచ్చిపోయింది. ఒక్క గంటలో నేను ఆ




ఆఫీసు గురించి తెలుసుకుని, ఇంటర్వ్యూకు హాజరు కావాలి.

అట్టహాసంగా కనిపించిన ఆ సెంట్రల్ స్టేషన్‌ను చూడగానే ముందు కాస్త కంగారు పడ్డాను. నెమ్మదిగా సెంట్రల్ స్టేషన్ నుంచి బయటపడ్డాను. ఇతర ప్రయాణీకులను అను సరిస్తూ.

ఆ తర్వాత నాకు ఎదురైంది భాషా సమస్య. నేను వెళ్లవలసిన ఆఫీసు-ఆ స్టేషన్ దగ్గర ఏ ప్రాంతంలో వుందని అడిగితే, ప్రతి వాడూ 'తెరియాదు.. తెరియాదు' అనేవాడే. అలా ఓ అరగంట అయిపోయింది.

సరిగ్గా అప్పుడే ఓ తెలుగాయన తటస్థపడ్డాడు. సదరన్ రైల్వే ఆఫీసుకు పక్కగా ఉండే మింట్ స్ట్రీట్‌లో ఆ డోర్ నెంబర్ ప్రకారం వెళ్తే, తేలిగ్గా తెలుసుకోవచ్చని, చాలా దగ్గరేనని, నడిచే వెళ్లిపోవచ్చని ఆయన చెప్పాక 'హమ్మయ్య' అని నిట్టూర్చాను.

ఆయన చెప్పిన గుర్తుల ప్రకారం ఒక మలుపు తిరిగే సరికి ఒక్కసారిగా నాకు 'షాక్' తగిలినంత పనైంది. ఆ రోడ్డు మీదుగా ఒక పెద్ద ఊరేగింపు వెళ్తోంది!

అవతలి వైపున వున్న ఆ రోడ్డుమీదకి వెళ్లాలంటే, ఈ ఊరేగింపును దాటి వెళ్లాలి. రెండు వైపులా తుపాకులతో బారులు తీరి వున్న పోలీసులు - ఎవరినీ అటువైపు వెళ్లనీయడం లేదు. ఊరేగింపు ఆ ప్రదేశాన్ని దాటి వెళ్లడానికి కనీసం రెండు గంటలైనా పడుతుందని, ఆ తర్వాతే వెళ్లాలనీ అందరినీ గదమాయిస్తున్నారు!

నాకు ఏడుపు వచ్చినంత పనైంది. ఆ పోలీసు వాళ్లను బ్రతిమలాడుతూ ఏడ్చాను కూడా! కాని ఏ ప్రయోజనమూ లేకపో యింది ఆరున్నరకు ఊరేగింపు పూర్తికాగా నే పరుగులు తీస్తూ ఆ ఆఫీసుకు చేరుకున్నాను. ఐదు న్నరకే ఆఫీసు మూసేశారట. అభ్యర్థుల ఎంపిక కూడా పూర్తయిందని అక్కడున్న వాచ్‌మేన్ చెప్పేసరికి ఒక్క క్షణం ప్రపంచమంతా చీకటిగా కనిపించింది. నీరసంగా అడుగులు వేసుకుంటూ సెంట్రల్ స్టేషన్‌కు తిరుగు ముఖం పట్టాను.

నేను వినియోగదారుణ్ణి. నా చదువు నన్ను ఆదుకోలేకపోతే, నేను ఎవరికి ఫిర్యాదు చేసుకోగలిగాను? రైలు నన్ను సమయానికి తీసుకు రాలేకపోతే ఎవరికి ఫిర్యాదు చేయగలిగాను? ఊరేగింపును నడిపించిన రాజకీయ నాయకులు నా భవిష్యత్తుకు అడ్డంగా నిలబడినప్పుడు - నేను ఎవరికి ఫిర్యాదు చేయాలి?